క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కొల్లూరి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలిలో వణుకుతూ పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకులకు సామాజిక బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ అంజలి, దుర్గా తేజ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నగరంలోని పలుప్రాంతాల్లో ఉన్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి సమయంలో దుప్పట్లు పంచడం సంతృప్తిగా ఉందని ఎక్స్ రే కార్యదర్శి బి.ఆంజనేయరాజు అన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, ఏడుకొండలు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, జయశ్రీ, కనకవల్లి, భాను, రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిశీలన



బూదవాడలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలు తీరు పరిశీలనలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బూదవాడ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో స్థానికంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో ఏఎన్‌సీ, పీఎన్‌సీ రిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలుపై ఆరా తీశారు. ఏఎన్ఎంల యాప్ లలో వివిధ సేవలు నమోదు విధానంపై పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలు తనిఖీ చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో బూచవరం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

డ్వామా పీడీ సూర్యనారాయణ

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, డ్వామా ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీని, జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ ప్రగతిని ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పనుల కల్పన అధికంగా జరగాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కలను పంపిణీకి అనుకూలంగా పెంచాలని ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో ఈ నర్సరీ నుంచి ఇతర ప్రాంతాలకు ఫలాలనిచ్చే మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. మునగ మొక్కలు పంపిణీపై వివరాలు తెలుసుకుని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యప్రియ, సిబ్బందిని అభినందించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం మరింత పురోగతి ఉండాలని హౌసింగ్ ఏఈ సాయికి చెప్పారు. లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకం ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీడీ వెంకటరమణారావు, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, పంచాయితీ కార్యదర్శి బాపూజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమాం మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరువూరు: రాజుపేటలోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామని తెలిపారు. ఇందుకు బాధ్యులైన హరికృష్ణ, రాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. 6-ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎం జగన్ పాలనలో రహదారులకు మహర్దశ

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విపక్షాలకు కన్నుకుట్టేలా నగరంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 32వ డివిజన్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్–1 లో రూ.1.52 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణ పనులతో పాటు ప్రధాన రహదారిలో రూ.15.35 లక్షలతో శానిటరీ కార్యాలయ నిర్మాణ పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే నగరంలో రహదారులకు మహర్దశ వచ్చిందన్నారు. టీడీపీ పాలనలో ఈ ప్రాంతాన్ని గాలికి వదిలివేశారన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అయ్యేవన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూపురేఖలే మార్చివేశామన్నారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు సైతం ఇక్కడ వర్షపునీరు నిల్వకుండా చర్యలు చేపట్టామన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో అంతర్గత రహదారులు, ప్రతి ఇంటికీ యూజీడీ కనెక్షన్, వీధి దీపాలు, పార్కుల సుందరీకరణతో అనూహ్య రీతిలో ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత లోటస్ సెక్టార్‌లో రూ. 6 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటిలో రూ.3.47 కోట్ల పనులు పూర్తి చేసుకోగా.. రూ.2.50 కోట్ల పనులు వివిధ దశలలో ఉన్నట్లు చెప్పారు. బసవతారకనగర్‌లో రూ.18 లక్షల నిధులతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు రూ. కోటి నిధులతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. శానిటరీ కార్యాలయ నిర్మాణం జరుగనున్న ప్రాంత పరిసరాలలో పేదలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. శంకుస్థాపనలు నిర్వహించుకున్న రోడ్ల పనులను పది రోజుల్లో పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ నగరం అభివృద్ధిలో దూసుకుపోతోందనడానికి సెంట్రల్ నియోజకవర్గమే చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం శంకుస్థాపనలు, శిలాఫలకాలకే పరిమితం అయ్యిందని అందినకాడికి దోచుకున్నారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు గుండే సుందర్ పాల్, ఆత్మకూరు సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో నగరంలోని రహదారులకు మహర్దశ పట్టుకుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ షణ్ముక్‌నగర్‌లో రూ.19.98 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారన్నారు. నగరంలోని రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ అఫ్రోజ్, పాలడుగు శివ, తోపుల వరలక్ష్మీ, మన్నెం అశోక్, చిరంజీవి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆధ్యాత్మికత, సేవలను రెండు కళ్లుగా చేసుకుని పనిచేస్తున్నామని ముత్యాలంపాడు షిరిడీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిరిడీసాయిబాబా మందిరంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ షిరిడీలో మాదిరిగా పూజలు సేవలు నిర్వహిస్తూ బాబా మందిరాన్ని ఆంధ్రాషిరిడీగా తీర్చిదిద్దామన్నారు. ప్రతి ఏటా చలిలో వణుకుతున్న పేదలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులు, దాతల సహకారం మరువలేనిదన్నారు. బాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన కచేరీలు



వీణపై త్యాగరాజ స్వామి కృతులను ఆలపిస్తున్న హేమలక్ష్మి, పద్మాచక్రవర్తి, శ్రీకంఠం నాగలక్ష్మి



గాత్ర కచేరి నిర్వహిస్తున్న అంజనా సుధాకర్

విజయవాడ కల్చరల్: సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధానా మహోత్సవాలు రామభక్తి సామ్రాజ్యాన్ని చాటుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమాలు జే హైగ్రీవ శర్మ గాత్ర కచేరితో ప్రారంభమయ్యాయి. వారణాసి బాలశ్రీవాణి, ఆకురాతి కోదండరామయ్య బీ.సీతాలక్ష్మి నిర్వహించిన గాత్ర కచేరీలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. మల్లాది శ్రీరాం ప్రసాద్, మల్లాది రవికుమార్ త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు తలచినంతనే నాదమునేమో, మాటిమాటికి దల్పవలనే రామ, నిను విన సుఖముగన అన్యాయము చేయకు రామ కీర్తనలను మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై వి.కృష్ణవేణి, మృదంగంపై సాయిగిరిధర్ వాద్య సహకారం అందించారు. నెల్లూరుకు చెందిన కావూరి హేమలక్ష్మి, రావినూతల పద్మచక్రవర్తి, శ్రీకంఠం నాగలక్ష్మి వీణపై త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను వీణపై పలికించారు. మోదుమూడి అంజనా సుధాకర్, ఆకురాతి కోదండరామయ్య హైదరాబాద్‌కు చెందిన డీవీకే వాసుదేవ్ బృందం, సాత్విక మోహన్, కే లక్ష్మీనరసమ్మ, విష్ణుబొట్ల సోదరమణులు త్యాగరాజ సంకీర్తనల వైభవాన్ని తమ కచేరీల ద్వారా చాటారు.

నేటి కార్యక్రమాలు

ప్రముఖ సంగీత విద్వాంసులు డీవీ మోహనకృష్ణ, అయ్యగారి సత్యప్రసాద్ విద్యావీఆర్‌కే కచేరీతో పాటు వర్ధమాన సంగీత కళాకారుల కచేరీలు ఉంటాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి.

వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలి



విజేతలతో కళాశాల సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారతదేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం యువజన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం 'భారతజాతి కీర్తి–స్వామి వివేకానందస్ఫూర్తి' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రం ఆంధ్ర తెలంగాణా ప్రాంత సమన్వయకర్త సీవీ సదాశివరావు విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. ఈ సందర్భంగా వివేకానంద సూక్తుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత చదరంగం శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: సంక్రాంతి సెలవులను పురుస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు చెస్ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ డైరక్టర్, జాతీయ ఆర్బిటర్ పి.రేణుకా తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్, మారుతీనగర్, పోరంకి ప్రాంతాల్లో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి ఉన్న వారు 97007 75220, 92471 53387ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఫిడే ఆర్బిటర్ ఎస్.ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరుతాయని తెలిపారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం బీఎస్ఎన్ఎల్ మెగా మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో బీఎస్ఎన్ఎల్ కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్ బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్, ఫ్రీ సిమ్ కార్డులు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్ ఇవ్వడంతో పాటు ఆకర్షణీయమైన ఫస్ట్ రీచార్జి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాంబేకాలనీలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబేకాలనీలోని రవీంద్రభారతి పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు మంగళవారం సందడిగా జరిగాయి. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు భోగిపళ్లు వేడుక, కోలాట నృత్యం, హరిదాసు, గంగిరెద్దుల సంబరాలు, కోడిపందెల దృశ్యాలు, బొమ్మల కొలువు, ధాన్యం పద్ధతి తెలిపేలా చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, జోనల్ ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

పెన్షన్ల నగదు పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు అందించే వైఎస్సార్ పెన్షన్ కానుకను పెంచడంతో లబ్ధిదారులందరి మొహాల్లో ఆనందం కనిపిస్తుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పేర్కొన్నారు. 59వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన ఆరుగురికి మంగళవారం ఆయన పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆత్మబంధువు అని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ప్రతి పథకాన్ని అందిస్తున్నారన్నారు. పాత పెన్షన్లతో పాటు కొత్తగా ఇంతమందికి పెన్షన్లు ఇస్తుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా మాత్రం పెన్షన్ల పంపిణీపై కూడా అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలంతా జగనన్నకు అండగా నిలుస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ హఫీజుల్లా పాల్గొన్నారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం



సభలో మాట్లాడుతున్న చల్లపల్లి స్వరూపరాణి

విజయవాడ కల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని, కవిత్వంలో ప్రజావేదన కనిపించాలని ఆచార్య కొలకలూరి స్వరూపరాణి అన్నారు. మద్దూరి బహుజన రచయితల వేదిక, దళిత చైతన్య స్రవంతి, సామాజిక న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం మద్దూరి నగేష్‌బాబు స్మారక పురస్కార సభను నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వరూప రాణి మాట్లాడుతూ కవి సమాజంలోని అసమానతలపై ధిక్కారస్వరం వినిపించాలని సూచించారు. కవి నగేష్ బాబు తన కవిత్వం ద్వారా దళితులు ఇతర బడుగు బలహీన వర్గాలవారిపై తన స్వరం బలంగా వినిపించారన్నారు. పురస్కార కమిటీ కన్వీనర్ తంగిరాల సోని మాట్లాడుతూ న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు నగేష్‌బాబు స్మారక పురస్కారానికి ఆధునిక కవిత్వంలో కృషిచేసిన వారిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహితీ విమర్శకుడు కే లక్ష్మీనరసయ్య సాహితీవేత్త శిఖా ఆకాష్, చప్పిడి కోటేశ్వరరావు ప్రసంగించారు. 2022 సంవత్సరానికి గానూ మద్దూరి నగేష్‌బాబు స్మారక ప్రధాన పురస్కారాన్ని పీ శ్రీనివాస గౌడ్ రచించిన ధైర్యవచనం కవితా సంపుటికి, స్ఫూర్తి పురస్కారాలకు సరికొండ నరసింహారాజు నెత్తుటిపాదాలు, డాక్టర్ గూటం స్వామి కవితా సంపుటి తిప్పుడు పొట్లాం, అవనిశ్రీ కవితా సంపుటి ధిక్కార ఖడ్గం, అమూల్యాచందు ఒంటిరొమ్ముతల్లి, సుంకర గోపాల్ రచించిన మానాయన పాటకు పురస్కారాలను అందజేశారు.

మధురస్వరాల గాయకుడు జేసుదాసు



జేసుదాసు గీతాలు పాడుతున్న దండు చంద్రశేఖర్, రూపాశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: మధురస్వరాల గాయకుడు జేసుదాసు అని సీనియర్ గాయకుడు దండు చంద్రశేర్ అన్నారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద మంగళవారం సినీ సంగీత దర్శకుడు నేపథ్య గాయకుడు జేసుదాసు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారతీయ భాషలన్నింటిలోనూ పాటలు పాడిన అద్భుత గాయకుడు జేసుదాసు అని తెలిపారు. అయ్యప్పస్వామి మీద ఆయన పాడిన పాటలు చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయాయని, కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారంతో సత్కరించాలని కోరారు. పలువురు గాయకులు జేసుదాసు గానం చేసిన పాటలను ఆలపించారు. విలాస్ బనియన్ అధినేత తటవర్తి సూర్యనారాయణ, జిలానీఖాన్, చారిత్రక పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మల్లీశ్వరి, డాక్టర్ హరిచందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ తమ పిల్లలకు నూతనంగా ప్రవేశపెట్టబడిన ఇమ్యునైజేషన్ పోలియో వ్యాక్సిన్‌ను పదో నెలలో వేయించి, పోలియోరహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పేర్కొన్నారు. స్థానిక గులాబీతోట 200వ సచివాలయంలో మంగళవారం ఇమ్యునైజేషన్ పోలియో వ్యాక్సిన్‌పై గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరిచందన వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీబీ ఆచారి, ఎం.రాము, బ్రహ్మదేశం వసంతకుమార్, కె.రాము పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి



జెండావిష్కరించి కార్మికులతో మాట్లాడుతున్న దుర్గారావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరగనున్న సీఐటీయూ జాతీయ 17వ మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు కోరారు. సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో సీఐటీయూ జెండాను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాల అసంఘటిత ఉద్యోగ, కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాని, అంబానిలాంటి బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తూ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగస్తులు ఐక్యంగా పోరాడాలని కోరారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.రమణారావు, ఎం.బాబూరావు, పవన్‌కుమార్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 56 మందికి ఉద్యోగాలు



అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేస్తున్న కుందా సీతారామశాస్త్రి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని శారదా కళాశాల్లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో 125 అభ్యర్థులు హాజరు కాగా 56 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. జాబ్‌మేళాలో విప్రో, యలమంచిలి సాఫ్టవేర్ ఎక్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, టెలీపెర్ఫార్మెన్స్, ఇన్నోవా సాఫ్ట్‌వేర్ వంటి 12 కంపెనీలు తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కళాశాల కరస్పాండెంట్ అండ్‌సెక్రటరీ కుందా సీతారామ శాస్త్రీ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర శర్మ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి ఆర్నెల్ల కోసారి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. మేళాలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



● పండగ కళ

సంక్రాంతి సందర్భంగా నగరంలో పలుచోట్ల మన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. బందరు రోడ్డులోని ఓ వ్యాపార సంస్థ ఎదుట ఎడ్ల బండ్లు, హరిదాసులు, పండగకు ముస్తాబైన పూరిగుడిసెలు తదితర సెట్టింగ్స్‌ఆకట్టుకుంటున్నాయి.

-సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

